# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 01 | సంచిక: 340 | పేజీలు: 4 | వెల: 4/- | మంగళవారం ● 25, జూన్ 2024 | ఎడిటర్: ఎం.వనిత రెడ్డి




రాజ్యసభలో బి.ఆర్.ఎస్. పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్‌గా తనను ఎంపిక చేసిన నేపథ్యంలో పార్టీ అధినేత కేసీఆర్‌ని సోమవారం ఎర్రవెల్లిలోని వారి నివాసంలో కలిసి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ వద్దిరాజు రవిచంద్ర.

# కొలువుదీరిన లోక్‌సభ

## తొలి రోజు 280 మంది సభ్యుల ప్రమాణం

- కొత్త పార్లమెంటు భవనంలో వేడుకగా కార్యక్రమం
- తొలి రోజు 280 మంది సభ్యుల ప్రమాణం పూర్తి
- విపక్షాల నిరసన సెగ.. నీట్‌పై నినాదాల హోరు
- మోదీ ప్రమాణం వేళ రాజ్యాంగం చూపిన రాహుల్
- ప్రొటెం స్పీకర్ ప్యానల్‌లోని ముగ్గురి వాకౌట్
- భర్తృహరి నియామకాన్ని నిరసిస్తూ నిర్ణయం
- అచ్చ తెలుగులో.. కిషన్‌రెడ్డి, సంజయ్, రామ్మోహన్, పెమ్మసాని సహా మాతృభాషలో 17 మంది ఎంపీల ప్రమాణం
- పంచెకట్టుతో పార్లమెంటుకు హాజరైన కిషన్‌రెడ్డి
- నేడు 15మంది తెలంగాణ ఎంపీల ప్రమాణం

ఢిల్లీ, జూన్24 (నమస్తే ఉదయం):

పార్లమెంట్ కొత్త భవనంలో 18వ లోక్‌సభ కొలువు దీరింది. ఈ భవనంలో లోక్‌సభ సభ్యుల ప్రమాణ స్వీకారం జరగడం ఇదే తొలిసారి. తొలుత ప్రొటెం స్పీకర్ భర్తృహరి మెహతాబ్‌తో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రమాణ స్వీకారం చేయించారు. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రధాని నరేంద్ర మోదీ లోక్‌సభ లోపలికి వచ్చేటప్పుడు సభ్యులు నిలబడి కరతాళ ధ్వనులతో ఆహ్వానించారు. ఆ తర్వాత లోక్‌సభ సభ్యులతో ప్రొటెం స్పీకర్ ప్రమాణం చేయించారు. తొలుత లోక్‌సభ ప్యానెల్ చైర్‌పర్సన్లుగా రాధామోహన్ సింగ్, ఫగ్గన్ సింగ్ కులస్తే ప్రమాణం చేశారు. ఉదయం 11.07 నిమిషాలకు నరేంద్ర మోదీ



ప్రమాణ స్వీకారం జరిగింది. ఆ తర్వాత వరుసగా రాజ్‌నాథ్ సింగ్, అమిత్‌షా, నితిన్ గడ్కరీ, శివరాజ్ సింగ్ చౌహాన్, మనోహర్ లాల్, హెచ్‌డీ కుమారస్వామి, పీయూష్ గోయల్, ధర్మేంద్ర ప్రధాన్, జితిన్ రామ్ మాంఝీతోపాటు మిగిలిన కేంద్ర మంత్రులతో ప్రమాణ స్వీకారం చేయించారు. 12.02 నిమిషాల వరకు కేంద్ర మంత్రులు, ఆ తర్వాత సహాయ మంత్రులు ప్రమాణ స్వీకారం చేశారు.

### నేడు 264 మంది ప్రమాణం

లోక్‌సభలో 543 మంది సభ్యులుండగా తొలిరోజు 280 మంది ప్రమాణం చేశారు. మిగతా సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది ఎంపీలు మొదటిరోజే ప్రమాణ స్వీకారం చేయగా, తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మినహా.. మిగతా వారు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్, ఆ పార్టీ కీలక నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం మంగళవారం జరగనుంది. అదేవిధంగా.. కేరళలోని వయనాడ్ లోక్‌సభకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు భర్తృహరి మహతాబ్ ప్రకటించారు.




# కీలక ఖనిజాల రంగంలో విస్తృత అవకాశాలు

- ఈ రంగంలో సంస్కరణలతో ముందుకెళ్తున్నామన్న కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- గనుల తవ్వకం, పర్యావరణ పరిరక్షణ మాకు రెండు కళ్లవంటివి రెండింటికీ సమాన ప్రాధాన్యత ఇస్తాం
- ఖనిజ రంగంలో ఆత్మనిర్భరత సాధిస్తాం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారతాం
- 4వ విడత క్రిటికల్ మినరల్ బ్లాకుల వేలం సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి
- భాగస్వాములందరి సహకారంతో మరింత ముందుకెళ్దామన్న కేంద్ర సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే
- డివిడెండ్లు కల్పించడంలో మెటల్, మైనింగ్ రంగం టాప్ అన్న సెక్రటరీ వీఎల్ కాంతారావ్

ఢిల్లీ,జూన్24 (నమస్తే ఉదయం):

కీలకమైన, తక్కువగా లభించే ఖనిజాల వెలికితీతలో అద్భుతమైన ఫలితాలు సాధించేందుకు విస్తృతమైన అవకాశాలున్నాయని, అందుకే ఈ రంగంలో విడతలవారిగా సంస్కరణలు తీసుకొస్తూ దేశ ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్నామని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. 2015లో కొత్తగా తీసుకొచ్చిన చట్టం ద్వారా సాను కూల మార్పులు కనబడుతున్నాయని ఆయన వెల్లడించారు.

ఢిల్లీలో జరిగిన,నాలుగో విడత కీలకమైన, తక్కువగా లభించే ఖనిజాల (క్రిటికల్ మినరల్) గనుల నాలుగో విడత వేలాన్ని కేంద్రమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'కొత్త గనుల చట్టం వచ్చిన తర్వాత గనుల వేలానికి తీసుకున్న నిర్ణయంలో భాగంగా,ఇప్పటివరకు 3 విడతల వేలం పూర్తయింది. నాలుగో విడత వేలం మొదలైంది.

ఈ కొత్త చట్టం అమలులో రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేస్తాం,ఈ రంగం ఆర్థికంగా మిగతా.. 2లో



# 2,450 ఎకరాల రక్షణ శాఖ భూములు బదలాయించండి

- వరంగల్ సైనిక స్కూల్ అనుమతులు పునరుద్ధరించండి
- రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

ఢిల్లీ, జూన్24 (నమస్తే ఉదయం):

హైదరాబాద్‌లో రహదారుల విస్తరణ, ఇతర అవసరాలకు రక్షణ శాఖ భూములు 2,500 ఎకరాలను తెలంగాణ ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం కలిశారు. రావిరాల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వానికి చెందిన 2,462 ఎకరాల భూములను ఇమారత్ పరిశోధన కేంద్రం (ఆర్‌సీఐ) ఉపయోగించుకుంటున్న విషయాన్ని ముఖ్యమంత్రి రక్షణ శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంతో పాటు నగరం చుట్టు పక్కల ప్రాంతాల్లో రహదారుల విస్తరణ, ఫ్లైఓవర్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు రక్షణ శాఖ భూములు తమకు అవసరమని, ఆర్‌సీఐ రాష్ట్ర ప్రభుత్వ భూములు వినియోగించుకుంటున్నందున రక్షణ శాఖ భూములు 2,450 ఎకరాలు తమకు అప్పగించాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. మిగతా.. 2లో

# విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను సిద్ధం చేయండి

## అధికారులను ఆదేశించిన డిప్యూటి సిఎం భట్టి

శ్రీశైలం,జూన్24(నమస్తే ఉదయం):

శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో అన్ని యూనిట్లను త్వరితగతిన సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి



చేపట్టాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. హైడల్ ప్రాజెక్టును ట్రాన్స్‌కో సీఎండీ రిజ్వీ, మాజీ సీఎంజీ హెచ్ అశోక్ కుమార్, హైడల్ డెరెక్టర్ వెంకట్‌రాజన్, సీఎంజీ హెచ్‌ఆర్ అజయ్‌తో కలిసి విద్యుత్ కేంద్రం సర్వీస్ బేలో పర్యటించారు. నాలుగో యూనిట్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన అమరులకు నివాళులు అర్పించారు. ప్రస్తుత పరిస్థితులను మిగతా.. 2లో




# రఘునందన్.. నీట్‌లో ఈడీ దర్యాప్తు అక్కర్లేదా?

- బండి సంజయ్ ఇపుడు ఎందుకు స్పందించడం లేదు?
- ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనే నీట్ ప్రశ్నా పత్రాలు లీక్
- సుపరిపాలన అంటే ఇదేనా ?
- జాతీయ స్థాయిలో ఒకే పరీక్ష తో అందరికీ ఎలా న్యాయం జరుగుతుంది ?
- మాజీ ఎంపీ బి.వినోద్ కుమార్

హైదరాబాద్,జూన్24 (నమస్తే ఉదయం):

దేశ వ్యాప్తంగా 24 లక్షల మంది నీట్ యూజీ రాశారు. నీట్ పీజీ నిన్న జరగాల్సింది. కేవలం పది గంటల ముందు ఆ పరీక్ష ను వాయిదా వేసింది. దుబాయ్ నుంచి కూడా ఈ పరీక్ష రాసేందుకు వచ్చారు. చివరి నిమిషం లో నీట్ పీజీ పరీక్ష రద్దు చేయడం వల్ల ఎంతో మంది నష్ట పోయారు.

నీట్ యూజీ పరీక్ష లో అవకతవకలు జరిగినప్పుడే నీట్ పీజీ పరీక్ష వాయిదా వేస్తే బాగుండేది. నీటి యూజి లో అనేక అవకతవకలు జరిగాయి. స్వతంత్ర భారత్‌లో ప్రవేశ పరీక్షల్లో జరిగిన అతి పెద్ద అవకతవకలు నీట్ యూజీలోనే జరిగాయి. ఎన్డీయే పాలిత రాష్ట్రాల్లోనే నీట్ ప్రశ్నా పత్రాలు లీక్ అయ్యాయి. కోట్లాది రూపాయలు చేతులు మారాయి.

గొర్రెల కొనుగోలు కుంభ కోణంలో ఈడీ విచారణ జరపాలని బిజెపి ఎంపీ రఘునందన్ అన్నారు. మరి నీట్ లో ఈడీ దర్యాప్తు అక్కర్లేదా ? చిన్న కేసులకు ఈడీని పంపే మోడీ, నీట్ అవకతవకలపై ఎందుకు రంగంలోకి దింపలేదు సుపరిపాలన అంటే ఇదేనా ? మిగతా.. 2లో



# తెలంగాణ ప్రగతి కోసమే కాంగ్రెస్‌లో చేరా

- రైతులు హాయిగా ఉండాలంటే రేవంత్‌తోనే సాధ్యం
- రాహుల్‌ను కలసిన అనంతరం మీడియాతో మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

న్యూఢిల్లీ,జూన్24 (నమస్తే ఉదయం):

"కొట్లాడి సాధించుకున్న తెలంగాణ అభివృద్ధి సాధించాలంటే అది కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని భావించా. అందుకే రేవంత్ సారథ్యంలో కాంగ్రెస్‌లో చేరా. రైతులు, పేదలు హాయిగా ఉండాలంటే అది సీఎం రేవంత్‌తోనే సాధ్యమని ప్రజలు గ్రహించారు కంటే కాంగ్రెస్‌కు మెజారిటీ ఇచ్చారు. ప్రజాతీర్పు, రాష్ట్రాభివృద్ధి కోసమే నేను కాంగ్రెస్‌లో చేరాన"ని, తెలంగాణ మాజీ స్పీకర్, సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, యువనేత రాహుల్‌గాంధీని కలసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

# మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరూ తలదించుకునే అంశం

- నిందితులను ఇప్పటికే రిమాండ్ చేశారు.. పూర్తి సమాచారం సేకరించి కఠిన చర్యలు తీసుకుంటాం
- ఈశ్వరమ్మ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకారం అందిస్తుంది, ఆదుకుంటుంది
- మంత్రి జూపల్లితో కలిసి నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన ఈశ్వరమ్మను, కుటుంబ సభ్యులను పరామర్శించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

నాగర్ కర్నూల్,జూన్24 (నమస్తే ఉదయం):

నాగర్ కర్నూలు జిల్లా, కొల్లాపూర్ మండలం, మొల చింతలపల్లికి చెందిన చెంచు గిరిజన మహిళ ఈశ్వరమ్మ పై జరిగిన అత్యాచారం ఘటన అమాన వీ యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.

సోమవారం ఉదయం నిమ్స్ హాస్పిటల్‌లో బాధితురాలు ఈశ్వరమ్మను కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం ఆయన స్థానికంగా మంత్రి జూపల్లి తో కలిసి మీడియాతో మాట్లాడారు. మానవత్వం ఉన్న ప్రతి ఒక్కరు తలదించుకునే ఘటన ఇది అని పేర్కొన్నారు. యావత్ సమాజం తీవ్రంగా ఖండించాల్సిన అంశం ఇది అన్నారు. ఘటన సమాచారం తెలిసిన వెంటనే మంత్రి జూపల్లి కృష్ణారావు బాధితురాలను నాగర్ కర్నూల్ ఆసుపత్రికి



తరలించి చికిత్స చేయించారని, మెరుగైన చికిత్స కోసం నిమ్స్ ఆస్పత్రికి సైతం తరలించారని వివరించారు.

ఘటన విషయాన్ని మంత్రి జూపల్లి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ఎంత ఖర్చైనా పర్వాలేదు ఈశ్వరమ్మ తిరిగి పూర్తిగా ఆరోగ్యంతో కోలుకునే వరకు ఉచితంగా ప్రభుత్వం వైద్య సహాయం అందిస్తుందని డిప్యూటీ సీఎం తెలిపారు. ఇల్లు లేని పక్షంలో ఇందిరమ్మ ఇల్లు, ఇద్దరు పిల్లలను ఆశ్రమ పాఠశాలలో వారు ఎంత వరకు చదువుకుంటాం అంటే అంతవరకు చదివిస్తాం, సాగుకు వ్యవసాయ భూమి కేటాయించడం వంటి అన్ని చర్యలు ప్రభుత్వపరంగా చేపడతామన్నారు.

ఈశ్వరమ్మ ఘటనలో సమీప బంధువులైన బావ, అక్క తోబాటు బయట ఒకరు ఇద్దరు ఉన్నట్టు సమాచారం ఉందని తెలిపారు. నిందితులను ఇప్పటికే రిమాండ్ కు తరలించారని, ఈ ఘటనలో పూర్తి సమాచారం సేకరించి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. రాష్ట్రంలో మరోసారి ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలకు ఆదేశించినట్టు తెలిపారు.


మీడియా సమావేశానికి ముందు ఆసుపత్రిలో ఈశ్వరమ్మతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ప్రస్తుతం అందుతున్న వైద్య సహాయం గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన చికిత్స అందించాలని, పూర్తి ఆరోగ్యంగా కోలుకున్న తర్వాతే డిశ్చార్జ్ చేయాలని వైద్య అధికారులను కోరారు.




రాజేంద్రనగర్ డివిజన్ జలమండలి జనరల్ మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎన్. సాయి లక్ష్మీ, జీ ఎం సాయి లక్ష్మీకు అభినందనలు

## జలమండలి రాజేంద్రనగర్ డివిజన్
# జీఎంగా ఎన్.సాయి లక్ష్మి

**రాజేంద్రనగర్, జూన్ 24(నమస్తే ఉదయం):** జలమండలి రాజేంద్రనగర్ డివిజన్ జనరల్ మేనేజర్‌గా ఎన్ సాయి లక్ష్మి నియమితులయ్యారు. ఈ మేరకు జలమండలి ఎండి సుదర్శన్ రెడ్డి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ జిఎమ్ గా పనిచేసిన శ్యాంసుందర్ సైదాబాద్ డివిజన్ జియంగా బదిలీ అయ్యారు.సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ లో గల జలమండలి సీఎం కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించిన జిఎం సాయి లక్ష్మి కి డిప్యూటీ జనరల్ మేనేజర్ జమీల్ అల్తాఫ్ హుస్సేన్, మేనేజర్లు నరసింహారెడ్డి, ఖాదర్, శ్రావ్య రెడ్డి, ఇతర సిబ్బంది పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిఎం సాయిలక్ష్మీ మాట్లాడుతూ... స్థానిక ప్రజాప్రతినిధులు, జలమండలి అధికారులు సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మంచినీటి సరఫరా లో మెరుగైన సేవలు అందించటానికి కృషి చేస్తామన్నారు. నూతన జిఎం గా పదవి బాధ్యతలు స్వీకరించిన సాయి లక్ష్మికి అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.



నూతన జీఎం సాయి లక్ష్మీకి పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మీటర్ రీడర్లు



వివిధ శాఖల అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

# నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం
## - ఎమ్మెల్యే జీఎంఆర్

**కొత్తకోట, జూన్ 24(నమస్తే ఉదయం):** నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తామని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జిఎంఆర్ అన్నారు. సోమవారం కొత్తకోట సమీపంలోని బీమా ఫేజ్–2 పంప్ హౌజ్ వద్ద ఇరిగేషన్, విద్యుత్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాల శాఖ, కొత్తకోట మున్సిపల్ అధికారులతో వివిధ అభివృద్ధి, సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ...

ఆయా మండలాల్లో చాలా కాలంలో పెండింగ్లో ఉన్న పనులను గుర్తించి, త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని, సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించి, పనులు వేగ వంతంగా సాగేలా కృషి చేస్తానన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. విద్యుత్ అధికారులతో మాట్లా డుతూ గ్రామాలలో అధికారులు స్వయంగా పర్యటించి సమస్యలు తెలుసుకుని తమ, తమ స్థాయిలో పరిష్కరించాలని, పరిష్కారం కానివి ఏవైనా ప్రతిపాదనలు తీసు కొస్తే సంబంధిత మంత్రితో చర్చించి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

# కీలక ఖనిజాల రంగంలో విస్తృత అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రాలకు లబ్ధిచేయడంతో పాటుగా వేలాది మందికి ఉపాధి కల్పిస్తుంది కాబట్టి.. రాష్ట్ర ప్రభుత్వాలకు సంపూర్ణ సహకారం అందిస్తూ ముందడుగేస్తాం' అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.




ఖనిజాల తవ్వకం భారతదేశానికి చాలా కీలకమని, అందుకే ఈ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర ప్రభుత్వం అన్నిరకాలుగా భాగస్వామ్య పక్షాలకు సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. రానున్న రోజుల్లో అన్ని ఖనిజాల వెలికితీతలో, మొదటి స్థానంలో ఉండేందుకు కేంద్రం సంపూర్ణ సహకారం అందిస్తుందన్నారు. గనులు తీసుకున్న వారు పనులను వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలని, గనుల మంత్రిత్వ శాఖ 24/7 అండగా నిలబడుతుందన్నారు.

'గనుల తవ్వకంతోపాటు పర్యావరణ పరిరక్షణ రెండూ మాకు కీలకమైన అంశాలు. ఈ రెండింటికీ సమానమైన ప్రాధాన్యతను అందిస్తాం. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారతదేశం ఎదిగేందుకు గనుల రంగంలో సాధించే ప్రగతి అత్యంత కీలకం. మోదీ వచ్చాకే రాష్ట్రాలకు వారికి అందాల్సిన వాటా సరిగ్గా అందుతోంది. ఉదాహరణకు ఒక్క ఒడిశాలోనే, ఏడాదికి రూ. 40వేల కోట్ల లబ్ధి చేకూరింది. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ దిశగా,సహకరించాలి. అందరు భాగస్వామ్య పక్షాలు సహకరిస్తే,ప్రతి 15 రోజులకో సంస్కరణ తీసుకొస్తాం. అందులో ఎలాంటి సందేహం లేదు' అని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

కీలకమైన ఖనిజాలను మనం అనుకున్నంతగా వెలికి తీయలేకపోయామని రాగి వంటి ఖనిజాలను మన దేశీయ అవసరాలకోసం దిగుమతి చేసుకుంటున్న విషయాన్ని కేంద్రమంత్రి గుర్తుచేశారు.

ఈ దిశగా ప్రత్యేకమైన దృష్టి సారించి భవిష్యత్తులో ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతామనే విశ్వాసం ఉందన్నారు. గనుల రంగం యువతకు ఉపాధితోపాటు, సాంకేతికతకు పెద్ద పీట వేస్తోందన్న కిషన్ రెడ్డి, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం. గనుల రంగంలో భారతదేశ సామర్థ్యాన్ని సద్వినియోగపరచుకుంటూ ఇందుకు ఉన్నటువంటి అన్ని అవకాశాలను సద్వినియోగ పరుచుకుంటామన్నారు.


ఈ కార్యక్రమం సందర్భంగా 'స్కీమ్ ఫర్ పార్షియల్ రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ ఎక్స్‌పెన్సెస్ ఫర్ హోల్డర్స్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ లైసెన్స్' పుస్తకాన్ని కేంద్రమంత్రి ఆవిష్కరించారు. అనంతరం, 2 కంపెనీలకు మైనింగ్ ఎక్స్ ప్లొరేషన్ లైసెన్స్ లను, ఈ రంగంలో మంచి ఫలితాలు సాధిస్తున్న కంపెనీలు =ఉణ సంస్థలకు ప్రోత్సాహకాలను అందజేశారు.

అంతకుముందు బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ దూబే మాట్లాడుతూ,మోదీ ప్రభుత్వం ఈ రంగంలో చేపడుతున్న సంస్కరణలకు అందరూ సహకారం అందించాల న్నారు. గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు మాట్లాడుతూ గనుల రంగం గణనీయమైన సంస్కరణలు సాధిస్తోందని తెలిపారు.

గతేడాది దేశవ్యాప్తంగా, మెటల్ అండ్ మైనింగ్ రంగానికి ఎక్కువ డివిడెండ్ దొరికింది. మినరల్ రంగం అభివృద్ధికి ఇదొక సంకేతమని సెక్రటరీ వీఎల్ కాంతారావు పేర్కొన్నారు. విదేశాల్లో లిథియం బ్లాక్స్ తీసుకున్నామని లిథియం వెలికితీతలోనూ ప్రగతి సాధిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ సహాయ మంత్రి సతీశ్ చంద్ర దూబే, గనుల శాఖ కార్యదర్శి వీఎల్ కాంతారావు, గనుల శాఖ అదనపు కార్యదర్శి సంజయ్ లోహియా, గనుల రంగ ప్రముఖులు, స్టార్టప్ కంపెనీల ప్రతి నిధులు, ఈ రంగంలో పరిశోధనలు చేస్తున్న సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు

# శంషాబాద్ బీజేవైఎం ఉపాధ్యక్షుడు వీరేందర్ రెడ్డి
## నియామక పత్రం అందజేసిన రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్



**శంషాబాద్,జూన్ 24( నమస్తే ఉదయం):** భారతీయ జనతా యువ మోర్చా ఉపాధ్యక్షుడిగా శంషాబాద్ పట్టణానికి చెందిన దమ్మాయిగూడ వీరేందర్ రెడ్డిని నియమించారు . బీజేవైఎం శంషాబాద్ మున్సిపల్ ఉపాధ్యక్షుడిగా వీరేందర్ రెడ్డిని శంషాబాద్ మున్సిపల్ బీజేవైఎం అధ్యక్షుడు వంశీ యాదవ్ నియమించారు. సోమవారం నియామక పత్రాన్ని రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు చేవెళ్ల మహేందర్ అందజేశారు. కార్యక్రమంలో బీజేవైఎం మునిసిపల్ అధ్యక్షుడు వంశీ యాదవ్ తో పాటు మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు దేవేందర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ సిద్ధు , మున్సిపల్ ప్రధాన కార్యదర్శి నర్సింగ్ రావు బీజేవైఎం యువ నాయకులు రాహుల్ గాజుల, శ్రీకాంత్, సాయి, ప్రకాష్,పాల్గొనారు.

# తెలంగాణ ప్రగతి కోసమే కాంగ్రెస్‌లో చేరా

(మొదటి పేజీ తరువాయి)

మీడియాతో పోచారం ఏమన్నారంటే.. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ రెడ్డి నాయకత్వంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఆరు నెలలుగా జరుగుతున్న ప్రభుత్వ పనితీరు, పరిపాలన, అంకితభావంను సీనియర్ నాయకునిగా, శాసనసభ్యునిగా గమనించాను. రాష్ట్ర ప్రగతి జరగాలన్నా, పేదల కష్టాలు తీరాలన్నా, రైతులు హాయిగా ఉండాలన్నా రేవంత్ రెడ్డిని



బలపరచాలనే ఉద్యే శంతో వారి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీలో చేరాను.

నాతో పాటుగా నా కుమారుడు, మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, మా బాన్సువాడ నియోజక వర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులందరం కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరాం. ఈరోజు కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీని కూడా కలవడం జరిగింది. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాలలో మరింతగా అభివృద్ధి చెందుతుందని ఆశిస్తు న్నాను. మంచి ఫలితాలు వస్తాయి. రేవంత్ రెడ్డి సమర్ధ వంతమైన ముఖ్యమంత్రిగా పేరు తెచ్చుకుంటున్నారు. నేను రేవంత్ రెడ్డి ని మనఃస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

అందరం కూడా రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని బల పరచాలి. నేను ఏడు సార్లు శాసనసభ్యునిగా విజయం సాదించాను. 1977లో నా రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీతోనే మొదలైంది.

తరువాత టిడిపి, టిఆర్ యస్ లలో పనిచేశాను. ఇప్పుడు రేవంత్ రెడ్డి నాయకత్వంలో తిరిగి కాంగ్రెస్ లోకి వచ్చాను. నా రాజకీయ ప్రస్థానం ఎక్కడ మొద లైందో తిరిగి ముగింపు అక్కడికే వచ్చింది.

# విద్యుత్ ఉత్పత్తి యూనిట్లను సిద్ధం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

పరిశీలించి.. వివరాలు అడిగి తెలుసుకున్నారు. లోపభూయిష్టమైన సాంకేతికతో రాష్ట్ర ప్రయోజనాలకు వచ్చే నష్టాన్ని వివరించి ఎలాంటి పొరపాట్లు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కిందిస్థాయి ఉద్యోగుల నుంచి సీఈవో వరకు ఒకే కుటుంబంలా సమష్టి కృషి చేసి త్వరితగతిన నాల్గో యూనిట్‌ను సిద్ధం చేసి విద్యుత్ ఉత్పత్తి చేయాలని సూచించారు. అనంతరం కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాల్గో యూనిట్ పునరుద్ధరణకు కావాల్సిన రూ.2కోట్ల అంచనా వ్యయాన్ని మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. 2006లో రికార్డు స్థాయిలో 26వేల మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసిన విధంగా ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాలని కోరారు.

సమావేశంలో పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలల ఎమ్మెల్యేలు చిక్కుడు వంశీకృష్ణ, కూచుకుల్ల రాజేశ్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, యెన్నం శ్రీనివాసరెడ్డి, తుడి మేఘారెడ్డితోపాటు సంస్థ సీఈ సూర్యనారాయణ, ఎస్‌ఈ ఆదినారాయణ పాల్గొని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

## తెలంగాణకు 2.70 లక్షల
# ఇళ్లు మంజూరు చేయండి
### కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం రేవంత్ వినతి

**న్యూఢిల్లీ,జూన్24 (నమస్తే ఉదయం):** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం తన ఢిల్లీ పర్యటనలో భాగంగా బిజీ బిజీగా గడిపారు. అందులో భాగంగా కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70 లక్షల ఇళ్లు మంజూరు చేయాలని కేంద్రమంత్రి ఖట్టర్‌కు సీఎం విజ్ఞప్తి చేశారు. అలాగే నిరుపేదలకు వారి సొంత స్థలాల్లో 25 లక్షల ఇళ్లు నిర్మించాలని తమ ప్రభుత్వం నిర్ణయించిన విషయాన్ని మంత్రి ఖట్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. ఇక రాష్ట్రంలో తాము నిర్మించదలచిన 25 లక్షల ఇళ్లలో 15 లక్షల ఇళ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని.. వాటిని లబ్దిదారు ఆధ్వర్యంలోని

వ్యక్తిగత గృహ నిర్మాణం (బీఎల్‌సీ) పద్ధతిలో నిర్మించనున్నట్లు కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు.

ఆర్థిక సంవత్సరంలో బీఎల్‌సీ మోడల్‌లో తెలంగాణకు 2.70లక్షల ఇండ్లను మంజూరు చేయాలని రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్రమంత్రిని సీఎం ఆయన నివాసంలో సోమవారం కలిశారు. పేదలకు సొంత స్థలాల్లో 25లక్షలు ఇండ్లు నిర్మించాలని నిర్ణయించిందని తెలిపారు. ప్రభుత్వ నిర్ణయించిన ఇండ్ల 15లక్షల ఇండ్లు పట్టణాభివృద్ధి సంస్థల పరిధిలోకి వస్తాయని.. వాటిని లబ్దిదారు ఆధ్వర్యంలోని వ్యక్తిగత ఇండ్ల నిర్మాణం పద్ధతిలో నిర్మించనున్నట్లు మంత్రికి వివరించారు.ప్రధానమంత్రి ఆవాస యోజనను (పట్టణ)–పీఎంఏవై (యూ) కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం తీసుకున్నందున, 2024–25 సంవత్సరానికి పీఎంఏవై (యూ) కింద మంజూరు చేసే ఇంటి నిర్మాణ వ్యయం నిధులు పెంచాలని, రాష్ట్రంలో తాము నిర్మించే ఇళ్లను పీఎంఏవై (యు) మార్గదర్శకాల ప్రకారం నిర్మిస్తామని వివరించారు. పీఎంఏవై (యూ) కింద ఇప్పటి వరకు తెలంగాణకు 1,59,372 ఇళ్లు మంజూరు చేసి రూ.2,390.58 కోట్లు గ్రాంట్‌ను ప్రకటించారని సీఎం గుర్తు చేశారు. అయితే, ఇందులో ఇప్పటి వరకు కేవలం రూ.1,605.70 కోట్లు మాత్రమే విడుదల చేశారని.. మిగతా నిధులు విడుదల చేయాలని కోరారు.స్మార్ట్ సిటీ మిషన్ కింద చేపట్టే పనులు పూర్తి కానుందున మిషన్ కాల పరిమితిని 2025, జూన్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీ మిషన్ కింద తెలంగాణలో వరంగల్, కరీంనగర్ నగరాల్లో పనులు చేపట్టినట్లు ఆయన కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మిషన్ కింద వరంగల్‌లో 45 పనులు పూర్తయ్యాయని.. రూ.518 కోట్ల వ్యయంతో చేపట్టిన మరో 66 పనులు కొనసాగుతున్నాయన్నారు. కరీంనగర్‌లో 25 పనులు పూర్తయ్యాయని, రూ.287 కోట్ల వ్యయంతో చేపట్టిన 22 పనులు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు. స్మార్ట్ సిటీ మిషన్ కాల పరిమితి ఈ ఏడాది జూన్ 30తో ముగుస్తోందని, ప్రజా ప్రయోజనార్థం పనులు ముగిసే వరకు మిషన్ కాలపరిమితిని మరో ఏడాది పొడిగించాలని కోరారు.

## 2,450 ఎకరాల రక్షణ శాఖ
# భూములు బదలాయించండి

(మొదటిపేజీ తరువాయి..)

రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖ భూముల పరస్పర బదిలీకి అంగీకరించాలని రక్షణ శాఖ మంత్రికి ముఖ్యమంత్రి విజప్తి చేశారు. వరంగల్ నగరానికి గతంలోనే సైనిక్ స్కూల్ మంజూరు చేసినా గత రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణపరంగా ఎటు వంటి చర్యలు తీసుకోలేదని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ దృష్టికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకెళ్లారు. వరంగల్ సైనిక్ స్కూల్ అనుమతుల గడువు ముగిసినందున అనుమతులు పునరుద్ధరించాలని లేదా తాజాగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

ముఖ్యమంత్రి వెంట నాగర్‌కర్నూల్, ఖమ్మం, మహబూబా బాద్, జహీరాబాద్, భువనగిరి, నల్గొండ, వరంగల్, పెద్దపల్లి



ఎంపీలు మల్లు రవి, రామసహాయం రఘురాం రెడ్డి, బలరాం నాయక్,సురేష్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి,కుందూరు రఘువీర్ రెడ్డి,కడియం కావ్య, గడ్డం వంశీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కమార్ యాదవ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి ఉన్నారు.

# రఘునందన్.. నీట్‌లో ఈడీ దర్యాప్తు అక్కర్లేదా?

(మొదటి పేజీ తరువాయి)

నీట్‌లో ఈడీ దర్యాప్తు కోసం సుప్రీం ముందు వేసిన పిటిషన్ ఈ రోజు విచారణకు వస్తోంది. బండి సంజయ్ గతంలో పదో తరగతి ప్రశ్నాపత్రం లీకేజి జరిగింది అని ఆరోపించారు. ఒక్కో విద్యార్థికి లక్ష రూపాయల నష్ట పరిహారం ఇవ్వాలని అపుడు బండి సంజయ్ డిమాండ్ చేశారు. నీట్ 24 లక్షల మంది రాశారు. వారందరికీ లక్ష రూపాయల పరిహారం ఇవ్వాలని బండి ఎందుకు డిమాండ్ చేయరు ? బండి సంజయ్ ఇపుడు ఎందుకు స్పందించడం లేదు? సీఎం రెవంత్ రెడ్డి ఇపుడు ఢిల్లీ లో ఉన్నారు. నీట్ నుంచి రాష్ట్రం బయటకు రావాలి. ఇందుకోసం రేవంత్ మంచి న్యాయవాదిని సుప్రీం కోర్టులో నియమించి రాష్ట్రం తరపున వాదనలు వినిపించాలి. రాష్టంలో ఎంసెట్ 60 ఏండ్లుగా బాగా జరిగింది. అదే పద్ధతి మళ్ళీ రావాలి. ఇప్పటి దాకా నీట్ ఎన్నిసార్లు లీక్ అయ్యిందో అనే అను మానాలు వస్తున్నాయి. మన విద్యార్థులు నీట్‌తో నష్టపడుతు న్నారు. రాష్ట్రాలను మునిసిపాలిటీలుగా మార్చాలనేదే బీజేపీ ఎత్తుగడ. అన్ని పరీక్షలనూ కేంద్రం తన గుప్పిట్లో పెట్టు కోవడం ఫెడరలిజంను మంట గలపడమే. పదో తరగతికి ఇంటర్ మీడియట్ కు ఒక్కో రాష్ట్రానికి ఒక్కో సిలబస్ ఉంది. జాతీయ స్థాయిలో ఒకే పరీక్షతో అందరికీ ఎలా న్యాయం జరుగుతుంది? పార్లమెంటు ఈరోజే కొలువు తీరింది.. విద్యార్థులకు న్యాయం చేయాలి.



## ఉచిత వైద్య శిబిరాలను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి

**- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్**

**కూకట్‌పల్లి, జూన్ 24(నమస్తే ఉదయం):**
కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రం సోమవారం ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంప్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫతేనగర్ డివిజన్ పరిధిలోని గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్ లో బోయినపల్లికి చెందిన శ్రీ రాఘవేంద్ర హాస్పిటల్ వారి సౌజన్యంతో కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయించారు. మెడికల్ హెల్త్ క్యాంప్ ను కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఏర్పాటు చేయించారు.

ఈ నేపథ్యంలో కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రతి డివిజన్ లోని ప్రతివారం బస్తీలలో వారం నుండి పది రోజులకు ఒకసారి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన బిపి, షుగర్ థైరాయిడ్, కంటి వివిధ రకాల వంటి సమస్యలను పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైతే చికిత్స కూడా చేపించే ఏర్పాట్లు చేయించడం జరుగుతుందని, కాబట్టి ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో రాఘవేంద్ర హాస్పిటల్ ప్రతినిధి సునీల్, శశి, బాగయ్య, సురేందర్ నాయుడు, సలావుద్దీన్, బాలమణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## జన్మదినాన్ని సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి ఆశీర్వాదం తీసుకున్న జగదీశ్వర్ గౌడ్

**కూకట్‌పల్లి, జూన్ 24 (నమస్తే ఉదయం):**
శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వి.జగదీశ్వర్ గౌడ్ జన్మదినాన్ని పురస్కరించుకుని సోమవారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, రాష్ట్ర



సీఎం రేవంత్ రెడ్డికి పుష్పగుచ్చం అందజేస్తున్న జగదీశ్వర్ గౌడ్, చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఉపముఖ్యమంత్రివర్యులు భట్టి విక్రమార్కని వారి నివాసంలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు ఇలానే అందుబాటులో ఉంటూ, ఆరోగ్యకరమైన జీవితంతో నీ ప్రతి అడుగు ప్రజలకు మంచి జరిగేలా, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని జగదీశ్వర్ గౌడ్‌కి సూచించారు.

## ప్రజల నుంచి వచ్చిన వినతులను సత్వరమే పరిష్కరిస్తాం

**అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు**

**ప్రజావాణిలో 45 మంది తమ సమస్యలపై వినతి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24 (నమస్తే ఉదయం):**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ముసిని వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు.



ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లకు సమస్యను వివరిస్తున్న మహిళ

సోమవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 45 మంది ఫిర్యాదు దారులు తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకున్నారని అయన తెలిపారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే జాప్యం లేకుండా జిల్లా అధికారులు పరిష్కరించాలని అయన అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 45 దరఖాస్తులలో 2 ఆసరా పెన్షన్లు, 3 ధరణి సమస్యలతో పాటు ఇతర శాఖలకు సంబంధించినవి 40 అర్జీలు అందాయని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ రాంచందర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.






నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డిఎస్పీ లింగయ్య, దొంగల నుండి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, సెల్, నగదు

## తాళాలు వేసిన ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితుల రిమాండ్

**నారాయణపేట, జూన్24(నమస్తే ఉదయం):**
జల్సాలకు అలవాటు పడి ఇండ్లకు తాళాలు వేసి ఉన్న ఇండ్లనే టార్గెట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి జైలుకు పంపించడం జరుగుతుందని డిఎస్పి ఎన్ లింగయ్య తెలిపారు. సోమవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని డిఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన నిందితుల వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా డిఎస్పి లింగయ్య ఏం మాట్లాడుతూ... మాగనూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వర్కురు గ్రామంలో రెండు ఇండ్లలో దొంగతనాలకు పాల్పడిన వారి వివరాలను డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఈనెల 20వ తేదీన అర్ధరాత్రి వర్కుర్ గ్రామంలో తాళం వున్న ఇంటికి తాళాలు పగులగొట్టి బంగారు నగలు వెండి వస్తువులను దొంగతనం చేయగా వర్కుర్ గ్రామానికి చెందిన ఇంటి యజమాని బొజ్జ మొల్ల సుజాత పిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు 21 తేదీ మగానూర్ పోలీస్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 24 తేదీ ఉదయం 07:00 గంటలకు మాగ నూర్ పోలీస్‌లు విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగట్టు మారెమ్మ గుడి దగ్గరలో ఇద్దరు అనుమనితులైన వ్యక్తులను పట్టుకొని విచారించగా వారిలో ఒక వ్యక్తి వర్క్యార్ గ్రామానికి చెందిన లక్ష్మప్ప కుమారుడు ఊరుముందర నరేశ్ ఏ కార్తీక్ (24) , అతని స్నేహితుడు కర్నూల్ జిల్లా దేవనకొనడ మండలం పి కోటకొండ గ్రామానికి చెందిన స్వర్గీయ ఉరుకుంది కుమారుడు బోయ వీరేంద్రలు ఇద్దరు గత 3 నెలలు గా పరిచయం ఏర్పడి ఇద్దరు కలిసి జల్సాలకు అలవాటు పడ్డారు. ఎలాగైనా డబ్బులు సంపాదించాలనే ఉదేశ్యంతో, ఇద్దరు కలిసి వార్క్యార్ గ్రామానికి వచ్చినారు. అక్కడే రెండు రోజులు ఉండి రెక్కీ నిర్వహించి తాళాలు వేసిన ఇండ్లను అదునుగా చూసి వర్క్యార్ గ్రామంలోని నరేష్ ఇంటి వెనకాల వున్న రెండు ఇండ్లలో తాళం వేసి ఉన్నాయి అని చూసి ఈనెల 20 తేదీ అర్ధరాత్రి ఇద్దరు కలిసి తాళాలు పగలగొట్టి దొంగతనానికి పాల్పడ్డారు. ఇంట్లో సుమారు 6 తులాల బంగారం ఆభరణాలు (మూడు లక్షలు) ,1.5 తులల వెండి , 200 చిల్లర పైసలు, ఒక మొబైలు ఫోన్ దొంగతనం చేశారు. ఈ రోజు(సోమవారం) మాగనూరు పోలీస్ లు అదుపులోకి తీసుకొని విచారించగా దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుండి 5.5 తులాల బంగారూ ఆభరణాలు (నేకలెస్స్, లాంగ్ చైన్,కమ్మలు చిన్న ఉంగరం ) , 1.5 వెండి వస్తువులు , ఒక సాంసంగ్ మొబైలు ఫోన్ , 8560/- రూయలు వారి నుండి స్వాధీనం చేసుకున్నారు. దొంగతనానికి పాల్పడిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్ట్ చేసి నారాయణపేట కోర్టు ముందు హాజరు పరిచారు. కోర్టు ఆదేశాల మేరకు వారిని జైల్‌కు పంపించామని డి.ఎస్.పి ఎన్ లింగయ్య తెలిపారు.

ఈ కేసును రెండు రోజుల్లో ఛేదించినందున మక్తల్ సీఐ చంద్రశేఖర్, మాగనూరు ఎస్సై అబ్దుల్ ఖాదర్, హెడ్ కానిస్టేబుల్ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ రవీందర్ సాయికుమార్, రాజశేఖర్ లను డీఎస్పీ లింగయ్య అభినందించి వారికి త్వరలో రివార్డు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

## ఈనెల 26న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్..

**ఏబీవీపీ బందుకు సహకరించాలి : కూకట్‌పల్లి జిల్లా కన్వీనర్ ప్రతీక్ గౌడ్**

**కూకట్‌పల్లి, జూన్ 24 (నమస్తే ఉదయం):**
తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కావస్తున్న ఇంతవరకు విద్యాశాఖ మంత్రి లేకపోవడం రాష్ట్ర ప్రభుత్వ సిగ్గుచేటు అని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ప్రతీక్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతి గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో విద్య వ్యవస్థను విధ్వంసం చేస్తుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు మరియు కళాశాలలు శిథిల అవస్థకు గురి అయిన పట్టించుకోని పరిస్థితి నెలకొంది అని అన్నారు. దీనిని అదునుగా చేసుకున్న ప్రవేట్ కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారంగా మార్చి లక్షలు ఫీజులు వసూలు చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తున్నాయి. కావున వెంటనే రాష్ట్ర ప్రభుత్వం నిద్రమబ్బు నుంచి మేల్కొని విద్యా వ్యవస్థను పట్టించుకోని విద్యార్థులను పట్టించుకోవాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తుందిని అన్నారు. లేనియెడల రాష్ట్రవ్యాప్తంగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పెద్ద ఎత్తున ఉద్యమానికి సిద్ధమవుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జూన్ 26న రాష్ట్రవ్యాప్తంగా



ప్రభుత్వ ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలలకు ఏబీవీపీ బందుకు పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి డిమాండ్లను సూచించారు.

1. ప్రభుత్వ గుర్తింపు మరియు నిబంధనలను పాటించినటు వంటి పాఠశాలల పైన కఠిన చర్యలు తీసుకోవాలి.
2. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలి.
3. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలి.
4. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తూ ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలి.
5. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీఈవో మరియు ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
6. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్నం భోజనంలో జరుగుతున్న అవకతవకలపై వెంటనే విచారణ జరిపి విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి.

## కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంది..

**కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్...**

**రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : షేరి సతీష్ రెడ్డి**

**సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం...**

**కూకట్‌పల్లి రైతుబజార్లో హర్షం వ్యక్తం చేసిన రైతులు...**

**కూకట్‌పల్లి, జూన్ 24 (నమస్తే ఉదయం):**
అసెంబ్లీ ఎన్నికల్లో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని మేనిఫెస్టోలో పెట్టిన నేపథ్యంలో ఇచ్చిన మాట ప్రకారం సీఎం రేవంత్ రెడ్డి రెండు రోజుల క్రితం మంత్రివర్గ ఏర్పాటుచేసిన సమావేశంలో ఏకగ్రీవంగా రైతులకు రెండు లక్షల రూపాయలు రుణమాఫీ చేస్తామని తీర్మానం చేశారు. దీనికి హర్షం వ్యక్తం చేస్తూ కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు షేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్ పల్లి రైతు బజార్ లో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి రైతులు, కాంగ్రెస్ నేతలు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జ్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు పక్షపాతి అన్నారు. ఇచ్చిన హామీలను సీఎం రేవంత్ రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేయించడం ఇది



సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చరిత్రలో సుస్థిరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తూ వారికి ఇబ్బందులు తలెత్తినా ఆదుకునే ప్రభుత్వమని ఈ సందర్భంగా తెలిపారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా ఎంతో మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా రన్నారు. అయినప్పటికీ కేసిఆర్ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. నిరంతరం ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై టిఆర్ఎస్ నేతలు తరచూ విమర్శలు చేస్తూ ప్రజలకు దూరమవుతున్నారని, ఇక ఆ పార్టీ దుకాణం బంద్ అవుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసలైన నిరుపేదల కోసం పనిచేస్తుందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం హామీలను అమలు చేసే కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రజలు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, గాలి బాలాజీ, అరవింద్ రెడ్డి, అప్పారావు, బాకీ, శివ చౌదరి, సంజీవ, రాజేందర్, రజిత, రేష్మ, జోజమ్మ, బండి సుధ తదితరులు పాల్గొన్నారు



బుద్వేల్‌లో జరుగుతున్న శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి వై శ్రీధర్

## బుద్వేల్‌లో ఘనంగా శ్రీశ్రీశ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు

**రాజేంద్రనగర్, జూన్ 24(నమస్తే ఉదయం):**
రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్‌లోని శ్రీ శ్రీ శ్రీ శివ పోతులూరు వీరబ్రహ్మం మఠము వారు 22వ వార్షికోత్సవం ఘనంగా కొనసాగుతున్నాయి. సోమవారం స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, పార్టీ నాయకులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



శేరి లింగంపల్లి కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ జన్మదిన సందర్భంగా విశ్వగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

## ఘనంగా జగదీశ్వర్ గౌడ్
# జన్మదిన వేడుకలు..

**మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ఎడ్ల సంపత్ రెడ్డి...**

**కూకట్‌పల్లి, జూన్ 24 (నమస్తే ఉదయం):** శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వి.జగదీష్ గౌడ్ జన్మదిన వేడుకలు నల్లగండ్లలోని వారి నివాసంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా కూకట్ పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎడ్ల సంపత్ రెడ్డి, సునీల్ కలిసి పూల బొకే ఇచ్చి, శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని, ఆయురారోగ్యాలతో, అష్ట ఐశ్వర్యాలతో తులతూగాలని, మున్ముందు మరెన్నో ఉన్నతపదవులను పొందాలని అకాంక్షించారు.

## ప్రభుత్వ విద్యాసంస్థలలో పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం: ఎమ్మెల్యే జిఎంఆర్

**దేవరకద్ర, జూన్24(నమస్తే ఉదయం):** ప్రభుత్వం విద్యాసంస్థలకు పర్తిస్తాయి మౌలిక సదుపాయాలు కల్పించి విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంటుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తెలిపారు. సోమవారం
దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీలో విద్యాశాఖ అధికారులు, ఇంటర్మీడియట్ అధ్యాపక బృందంతో దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... కొత్తగా మంజూరైన డిగ్రీ కళాశాల భవన నిర్మాణం పూర్తి అయ్యే వరకు, ప్రస్తుత విద్యా సంవత్సరం డిగ్రీ కళాశాల తరగతులను ఇంటర్మీడియట్ కాలేజ్ భవనంలో నిర్వహించాలన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి
రేవంత్ రెడ్డికి, ఆర్థిక అనుమతులు ఇచ్చిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి ధన్యవాదాలు తెలియజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత మొట్టమొదటి డిగ్రీ కళాశాల దేవరకద్ర నియోజకవర్గానికి కేటాయించడం సంతోషకరమని అన్నారు, ఈ విద్యా సంవత్సరం నుండి డిగ్రీ కళాశాల ప్రక్రియ మొదలైందని, ఈ ఏడాది బీఎస్సీ ఫిజికల్ సైన్సెస్, ఎంపీసీ ఎంపీసీఎస్ లో 60 సీట్లు, డీఎస్సీ లైఫ్ సైన్స్ బి జెడ్ సి కోర్సులలో 60 సీట్లు, బి ఏ హెచ్ ఇ పిలో 60 సీట్లు, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీకాం సీఏలో 60 సీట్లు మొత్తంగా 240 సీట్లు అందుబాటులో ఉన్నాయని ఈ నెల 28వ తేదీ నుండి దోస్త్ యాప్ లో వెబ్ ఆప్షన్ లో నమోదు చేసుకుని, డిగ్రీ కాలేజీ లో అడ్మిషన్లు పొందాలని విద్యార్థులకు ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్ రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి , డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## అమరచింత మున్సిపాలిటీలో ఔట్సోర్సింగ్ ఉద్యోగుల భర్తీపై విచారణ జరపాలి

**వనపర్తి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేసిన నిరుద్యోగి**

**అమరచింత, జూన్24(నమస్తే ఉదయం):** అమరచింత మున్సిపాలిటీ కార్యాలయంలో భర్తీ చేసిన ఔట్సో ర్సింగ్ ఉద్యోగాలపై విచారణ జరిపించాలని ఓ నిరుద్యోగి జిల్లా కలెక్టర్ కు ఆన్లైన్లో ఫిర్యాదు చేశారు. తాను ఎంఏబి. ఏడ్ చదివానని నా పేరు కె కృష్ణమూర్తి చదువుకున్న నిరుద్యోగిని అని ఫిర్యాదులు పేర్కొన్నారు. అమరచింత మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్దంగా సి డి ఎం ఏ ఆదేశాలు లేకుండా ఇష్టానుసారంగా వివిద రకాల ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల నియామకాలపై విచారణ చేపట్టాలని కోరారు.

అమరచింత మున్సిపల్ ఏర్పాటు అయ్యాక 2021 నుంచి ప్రస్తుత సంవత్సరం వరకు వివిధ రకాల ఉద్యోగ నియామకాలు ఎవరి ఆదేశాలు లేకుండా పత్రికా ప్రకటన , నోటిఫికేషన్ లేకుండా ఇష్టానుసారంగా అధికారం చేతుల్లో ఉందని చైర్మన్,వైస్ చైర్మన్ ఏకపక్షంగా వ్యవహరిస్థూ స్థానికంగా ఎంతో మంది చదువుకున్న నిరుద్యోగులు ఉన్నా అర్హులని ప్రక్కన పెట్టి అనర్హులని లోపాయ కారి ఒప్పందంతో ఉద్యోగాల ఎంపిక ప్రక్రియ చేశారని కృష్ణమూర్తి ఆరోపించారు. ఈ విషయాన్ని మీ దృష్టికి (జిల్లా కలెక్టరు)కి తీసుకు వస్తున్నాము. 2021 నుంచి ప్రస్తుత సంవత్సరం వరకు నియామకం చేసుకున్న అన్ని ఉద్యోగ నియామకాలపై విచారణ జరిపించి అనర్హులని తొలగించాలని కోరారు.

మున్సిపల్ కార్యాలయంలో అవసరమైన మేరకు అర్హులని ఎంపిక చేయాలని కోరారు.

## ఒకేసారి రైతుల రెండు లక్షల రుణమాఫీ

**- ఎమ్మెల్యే జీఎంఆర్**

**కొత్తకోట, జూన్24(నమస్తే ఉదయం):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన రెండు లక్షల రుణమాఫీని త్వరలో ఒకేసారి అమలు చేస్తుందని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు గవినోళ్ల మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం

కొత్తకోట మండలం మిరాస్ పల్లి గ్రామంలో విస్తృతంగా దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్

మిరాస్ పల్లి గ్రామంలో పాఠశాల విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ మాట్లాడుతూ... అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ఓట్లేసి మెజార్టీ ఇచ్చిన మిరాస్ పల్లి గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలో విస్తృతంగా పర్యటించి గ్రామంలో దర్గా ను దర్శించుకుని, గ్రామంలోని పలు కుల సంఘాల కమ్యూనిటీ భవనాలు పరిశీలించారు. ఎస్సీ కాలనీ లోని పర్యటించి, సమస్యలు అడిగి తెలుసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కాలనీ లోని విద్యుత్ సమస్య గురించి తెలుసుకుని సమస్య పరిష్కారించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రావుల జితేంద్రనాథ్ రెడ్డి, మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాయిరెడ్డి, నాయకులు ఉమామహేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మిరాసిపల్లి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్




## బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా
# డి.సత్యనారాయణ ముదిరాజ్

**రాజేంద్రనగర్, జూన్ 24(నమస్తే ఉదయం):** బిజెపి ఒబిసి మోర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా రాజేంద్రనగర్ కు చెందిన డి.సత్యనారాయణ ఈ మేరకు బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్ నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డి సత్యనారాయణ ను మూడవ సారి నియమించిన ఒబిసి మోర్చ రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ గౌడ్‌కి, రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి కి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోక్క నర్సింహా రెడ్డి కి రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులు, పార్టీ సీనియర్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ... రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తూ కేంద్ర ప్రభుత్వ అభివృద్ధిని, పేద ప్రజల సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ చైత్ర స్థాయిలో వాటిని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు.నాపై పార్టీ అధిష్టానం నమ్మకము తో మూడవ సారి నియమించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు.



ఆనంద్ గౌడ్ నుంచి నియామక పత్రాన్ని అందుకుంటున్న డి.సత్యనారాయణ ముదిరాజ్



నీట్‌పై జరిగిన అవకతవకలను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న విద్యార్థులు

## నీట్ అవకతవకలపై సుప్రీంకోర్టు జడ్జితో
# విచారణ జరిపించాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, జూన్ 24(నమస్తే ఉదయం):** మే 5న నిర్వహించిన మెడికల్ ప్రవేశ పరీక్ష నీట్-యూజీ నిర్వహణలో అవకతవకలు జరిగాయని, సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపించాలని ఎన్ఎస్ యు ఐ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, యుఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు రంగస్వామి, ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్ , విద్యార్థులు డిమాండ్ చేశారు. సోమవారం గద్వాల పట్టణం వైఎస్ ఆర్ చౌక్‌లో విద్యార్థి సంఘం నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న నీట్ అవకతవకలను సిబిఐతో కాకుండా సుప్రీం కోర్టు జుడీషియల్ కమిటీ తో విచారణ జరిపించాలని కోరారు. ప్రధాని నరేంద్రమోడీ తీసుకవచ్చిన నూతన జాతీయ విద్యా విధానం లోపాభూయిష్టంగా ఉందని నీట్ పరీక్ష లో జరిగిన అక్రమాలకు ఈ విద్యా విధానమే కారణం అని ఆరోపించారు.

నీట్ అక్రమాల వల్ల 24 లక్షల మంది విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని, నీట్ పరీక్షను రద్దు చేసి గతంలో మాదిరిగా వీటి నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు నోట్ బుక్స్

**- పలకల పంపిణీ చేసిన కావలి సతీష్**

**శంషాబాద్, జూన్ 24( నమస్తే ఉదయం):** శంషాబాద్ మున్సిపల్ పరిధిలోని ఇందిరానగర్. ఊట్ పల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులకు శంషాబాద్ మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ బీసీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కావలి సతీష్ సోమవారం నోట్ బుక్స్ పలకలు పంపిణీ చేశారు. వార్షిక సెలవుల అనంతరం పాఠశాలలు తిరిగి ప్రారంభం కావడంతో ఊట్ పల్లి ఇందిరానగర్ బస్తిలలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని విద్యార్థులను ప్రోత్సహించేందుకుగాను తన వంతు సహాయంగా పలకలు. నోట్ బుక్స్‌ను ఉచితంగా అందజేసినట్లు సతీష్ తెలిపారు. తల్లిదండ్రులందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలని సూచించారు. కెసిఆర్ హయాంలో ప్రవేశపెట్టిన సన్న బియ్యం పథకం కొనసాగుతుందని చిన్నారి విద్యార్థులకు ప్రభుత్వ పరంగా ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తున్నందున ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని సతీష్ సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బోడంపాటి మహేష్. విద్యా కమిటీ చైర్మన్ కావలి రాము, గొల్లపల్లి వీరేష్ పాల్గొన్నారు.

## మల్లెబారి సాహెబ్ దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్



**దేవరకద్ర, జూన్24(నమస్తే ఉదయం):** దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మల్లెబారి సాహెబ్ ఉర్సే షరీఫ్ 116 గంధం మహోత్సవంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ రెడ్డి , కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్లెబారి సాహెబ్ ఉర్సే షరీఫ్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**Printed and Published M. DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, HNO:6-2-4/1,Shivaram pally ,Rajendranager, Ranga Reddy Dist, Telangana State -500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally, NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.VANITHA REDDY. “RNI. Title- Code: TEL TEL 12232**. Cell: 89779 39135.